

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌టిసి కార్మికుల నిరసన

నూజివీడు టౌన్ :తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టిసి కార్మికులు డిపో వద్ద కార్మిక ఐక్య సంఘాల ఆధ్వర్యంలో శనివారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు.



నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వారకాతిరుమల, ముసునూరు, ఏలూరు, గుడివాడ ప్రాంతాలకు వెళ్లిన సమయంలో ఓవర్ టైం అలవెన్సులు చెల్లించాలని, ఎనిమిది గంటల పని దినాలు అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్సులు, 20 నెలల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా సమైక్యంగా పోరాడేందుకు ఐక్య కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్మిక సంఘ నేతలు భాస్కరరావు, రవి, రమేష్, ఎకెడి.ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

అన్నదాత దు:ఖీభవ..!



- పెట్టుబడి సాయం రూ.20 వేలపై రైతుల్లో చర్చ
- రబీ సాగు ప్రారంభమవుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- రెండు జిల్లాల్లో సుమారు 2.50 లక్షల మంది రైతుల ఎదురుచూపు
- కౌలురైతులకు అందేలా చర్యలుండేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'అన్నదాత సుఖీభవ' కింద ప్రభుత్వం అందిస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారంటూ అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ఆర్భాటంగా హామీలు గుప్పించిన కూటమి అధికారంలోకొచ్చి ఆరు నెలలు గడిచినా రైతులకు అందించాల్సిన సాయంపై నోరు విప్పకపోవడం రైతాంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఖరీఫ్ పూర్తయ్యిందని, రబీ సాగు ప్రారంభం కావడంతో ఇప్పుడైనా పెట్టుబడి సాయం తమ ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా కింద ఏటా రైతులకు రూ.13,500 చొప్పున అందించింది. దీనిలో కేంద్రం మూడు విడతలుగా రూ.ఆరు వేలు జమ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభంలో మే చివరి వారంలో మొదటి విడతగా రూ.5,500, రెండో విడతగా రబీ సీజన్‌కు అనువుగా జనవరిలో రూ.రెండు వేలు రైతుల ఖాతాల్లో జమ చేసేది. రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం అందుకునేవారు. ఏలూరు జిల్లాలోనే లక్షా 35 వేల మంది వరకూ లబ్ధిదారులైన రైతులు ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామంటూ టిడిపి కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతానికిపైగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో రైతు కుటుంబాలు ఎన్నికల్లో కూటమికి జైకొట్టాయి. రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లు టిడిపి కూటమి గెలుచుకుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. పెట్టుబడి సాయానికి గత ప్రభుత్వం రైతు భరోసా అని పేరు పెట్టగా, ఈ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయం అందించనున్నట్లు తెలిపింది. అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ రైతులకు పెట్టుబడి సాయం హామీ మాత్రం కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. ఖరీఫ్ పూర్తయ్యి, రబీ ప్రారంభమైనా పెట్టుబడి సాయంపై ప్రభుత్వం మాట్లాడకపోవడం రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పంట సాగు సమయంలో పెట్టుబడి సాయం అందించకపోతే ఏ విధంగా మేలు జరుగుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది అసలు పెట్టుబడి సాయం ఇస్తారా అనే అనుమానాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం సొమ్ము అందించాలని రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందేనా..?


ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలు రైతులే చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం పెట్టుబడి సాయం సాగు చేసే రైతులకే అందించాలి. ప్రభుత్వం అందించే సాయం కౌలు రైతులకు అందించాల్సి ఉంది. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని ప్రభుత్వం మాటలతోనే కాలక్షేపం చేస్తోంది. ఇ-క్రాప్‌లో భూ యజమానుల పేర్లే ఉన్నాయి. ఇ-క్రాప్ ఆధారంగా పెట్టుబడి సాయం అందిస్తే భూ యజమానులకే వెళ్లిపోతుంది. సాగు చేసే కౌలురైతులకు ఎటువంటి న్యాయమూ జరగదు. ప్రభుత్వం సాగు చేసే కౌలురైతులకే పెట్టుబడి సాయం రూ.20 వేలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. బ్యాంకులు అందించే పంట రుణాలు సాగుచేసే కౌలురైతులకు అందని పరిస్థితి నెలకొంది. రైతుమిత్ర గ్రూపుల ద్వారా కొద్ది మొత్తంలో రుణాలు అందించి కౌలురైతులకు ఇచ్చినట్లు లెక్కలు చూపుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించడంతోపాటు, సాగుచేసే కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

ప్రజల సంక్షేమానికి కృషి

పింఛన్ల పంపిణీలో రాష్ట్ర మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రతి నెలా రూ.2,712 కోట్లను ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లుగా అందిస్తున్నామని చెప్పారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో శనివారం ఇంటింటికీ వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ పెన్షన్ మొత్తాన్ని ప్రతి నెల మొదటి తేదీనే మొత్తం పెన్షనర్ల అందరికి ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ అందిస్తున్నామని, ఆ సమయంలో ఇంట్లో లేని వారికి రెండో తేదీన అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 7,874 మందికి రూ.3,30,75,500 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ కూటమి సభ్యులతో చారిత్రాత్మక విజయాన్ని అందించారని, ఆ విజయాన్ని బాధ్యతగా భావించి ప్రజల ఆకాంక్షల మేరకు అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి ఆర్‌డిఒలతో ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేస్తానని, మండలంలో భూ సమస్యలపై చాలా మంది ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. వీటి కోసం జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలో డ్రెయినేజీ, రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గరికిముక్కు నాని, తుమ్మల నాగేశ్వరరావు, మానం వంశీ, ఎ.రాంబాబు, మనం ఘంటేశ్వరరావు పాల్గొన్నారు.



పింఛన్లు అందిస్తున్న మంత్రి పార్థసారథి

క్రీడల్లో జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో నిలపాలి

జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి

ప్రజాశక్తి - పెదవేగి

క్రీడల్లో జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో నిలపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ ఎన్‌సిసి విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం జోన్ 1, 2, 3, 4కు చెందిన గురుకుల పాఠశాల క్రీడాకారుల ఫ్లాగ్ మార్చ్‌ను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతివ్వాలన్నారు. క్రీడల ద్వారా పట్టుదల, క్రమశిక్షణ, పోటీతత్వం అలవడుతుందన్నారు. గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడాస్ఫూర్తితో విజయం సాధించి అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. విద్య ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. అనంతరం విజేతలకు మెమెంటోలు అందజేశారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎన్.సంజీవరావు, ఎ.మురళీకృష్ణ, ఎఎంఒ బివి. మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కార దిక్సూచి.. పిడిఎఫ్

- ఉద్యమాలను ముందుండి నడిపించాలన్నా.. ప్రజాగొంతు వినిపించాలన్నా పిడిఎఫ్‌కే సాధ్యం
- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, సామాన్య ప్రజలకు అండగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు
- 5న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక
- బరిలో నిలిచిన పిడిఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తి
- యుటిఎఫ్‌తోపాటు మద్దతు పలికిన పలు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు

ప్రజాశక్తి - భీమవరం

సమస్య ఏదైనా.. పరిష్కారమే లక్ష్యంగా ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంది. ఎన్ని అవరోధాలు వచ్చినా.. మరెన్నో ఇబ్బందులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతానికి పిడిఎఫ్ కట్టుబడి పని చేస్తోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజానీకానికి అండగా నిలుస్తూ సమస్యల పరిష్కార వేదికగా పిడిఎఫ్ నిలుస్తోంది. ఉద్యమాలను ముందుండి నడిపించాలన్నా.. ప్రజాగొంతు వినిపించాలన్నా పిడిఎఫ్‌కే సాధ్యం. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్న పరిస్థితుల్లో పిడిఎఫ్ తనదైన పాత్ర పోషించాలంటే చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఒకే తాటిపైకి వచ్చి సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ అందించిన సాయం, చేసిన కృషిని మరోమారు గుర్తు చేసుకుని వచ్చే నెల ఐదో తేదీన జరగనున్న ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ బలపర్చిన బి.గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన గురుతర బాధ్యత అందరిపైనా ఉంది.

డిసెంబర్ 5న జరగనున్న తూర్పు - పశ్చిమగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉపఎన్నికల్లో యుటిఎఫ్, ఎపిటిఎఫ్-1938, బిటిఎ, ఎటిఎ, టిడబ్ల్యూఇఎ, ఎపి ఆర్ఇఐఎస్, జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్స్ మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా బొర్రా గోపీమూర్తి బరిలో నిలిచారు. అయితే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను ఎందుకు గెలిపించుకోవాలి, ఆ ఎంఎల్‌సిల పని విధానం ఏ విధంగా ఉంటుంది, వారు ఏం చేస్తారు, ఎవరి పక్షాన నిలుస్తారనే అంశాలను తెలుసుకోవడంతోపాటు మరోసారి వాటిని గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యాంశంగా ఉంది.

ఇప్పటి వరకూ పని చేసిన పిడిఎఫ్ ఎంఎల్‌సిలు సమస్యలపై ప్రశ్నించారు. మండలిలో సామాన్యుడి గళమై వినిపించారు. ఉద్యమాలకు అండగా ఉన్నారు. ప్రభుత్వంతో వారధిగా వ్యవహరించారు. అభివృద్ధికి సలహాలిచ్చారు. అసంబద్ధాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. నిజాయతీగా మసలుకున్నారు. నిక్కచ్చిగా వ్యవహరించారు. అధికార దర్పానికి దూరంగా ఉన్నారు. సామాన్య ప్రజల్లో ఒకరిగా ఉంటున్నారు.

ముఖ్యంగా అప్రంటీస్ విధానం రద్దు, ఆ సర్వీసు పెన్షన్, నోషనల్ ఇంక్రిమెంట్లు, గిరిజన, మున్సిపల్ టీచర్ల సర్వీస్ రూల్స్, ఎయిడెడ్ టీచర్లకు 010 హెడ్ ద్వారా జీతాలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల మినిమమ్ టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్, కెజిబివి, అంగన్‌వాడీ, రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్ల సమస్యలు, ఇలా ప్రతి సమస్య పరిష్కారంలో సంఘాలకు అండగా నిలిచారు. పోరాటాలకు ముందున్నారు. ప్రయివేట్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యలను సైతం మండలిలో ప్రస్తావించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించే బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్, టిటిడి ఉద్యోగులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు ఎక్కడ ఏ ఉద్యమాలు చేపట్టినా వారికి అండగా నిలిచారు. వారి ప్రజాస్వామ్య హక్కుల కోసం కృషి చేశారు. క్లస్టర్ విధానాన్ని వ్యతిరేకించి ఐదుగురు టీచర్లతో కూడిన మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు కృషి చేశారు. తాజాగా నూతన విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలల కుదింపునకు వ్యతిరేకంగా బస్సుయాత్ర చేపట్టి ప్రాథమిక పాఠశాలలను రక్షించే ప్రయత్నం చేశారు. సిపిఎస్ రద్దు కోసం జరిగిన ప్రతి పోరాటంలోనూ ముందుండి పాల్గొన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉద్యోగ, ఉపాధ్యాయుల సుఖ సంతోషాల్లోనే కాదు.. కష్ట నష్టాల్లో కూడా పాలుపంచుకుంటున్నారు. అందుకే ఎవరికి ఏ చిన్న కష్టమొచ్చినా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఎక్కడా అంటుంటారు.

రాష్ట్రంలో పాలకపార్టీ తాము చెప్పిందే వేదమన్నట్లు వ్యవహరిస్తున్న నేపథ్యం.. ప్రజా సమస్యలకన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనే ప్రధాన ప్రతిపక్షం.. ఈ రెండింటికీ భిన్నంగా ప్రజా సమస్యలపై మండలిలో నికరంగా గళమెత్తేవారు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమే.



గోపీమూర్తి

టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థిగా బి.గోపీమూర్తి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఆసక్తిగా మారింది. ఈసారి పోటీ ఎలా ఉంటుందోననే చర్చ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే నాలుగు దఫాలు ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. 2007 నుంచి 2009 వరకూ శేషారెడ్డి, రెండోసారి 2010 నుంచి 2015 వరకూ చైతన్యరాజు, మూడోసారి పిడిఎఫ్ బలపర్చిన రాము సూర్యారావు, నాలుగోసారి 2021 మార్చి 17న జరిగిన ఎన్నికల్లో షేక్ సాబ్జీ విజయం సాధించారు. ఆయన 2023 డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 17,467 మంది ఓటర్లుండగా 16,054 ఓట్లు పోలయ్యాయి. 11 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు రాగా, వైసిపితో పాటు పిఆర్‌టియు, ఇతర ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలోకి దిగిన సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 6,453 ఓట్లు పోలయ్యాయి. దీంతో షేక్ సాబ్జీ 1,534 ఓట్ల మెజారిటీతో మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టిడిపి మద్దతు తెలిపిన చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బిజెపి మద్దతుతో పోటీ చేసిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు పడ్డాయి. పిడిఎఫ్ తరపున ఎంఎల్‌సిలుగా గెలుపొందిన రాము సూర్యారావు, షేక్ సాబ్జీ పనితీరుపై ఉపాధ్యాయుల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి బరిలోకి దిగారు. ఆయన ముమ్మర ప్రచారంలో ఉన్నారు. విద్యావేత్తగా, సామాజికవేత్తగా గోపీమూర్తికి మంచి పేరుంది. ఉపాధ్యాయ ఉద్యమ సారధిగా, షేక్ సాబ్జీ ఉద్యమ వారసునిగా పేరొందారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రతిసారీ పిడిఎఫ్ బలంగా పోటీ ఇవ్వడమే కాకుండా విజయం సాధిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో కూడా పిడిఎఫ్‌కు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని, గోపీమూర్తి విజయం తథ్యమనే ప్రచారం జోరుగా సాగుతోంది.

మోస్తరు వర్షం.. రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బంగాళాఖాతంలో ఏర్ప డిన అల్పపీడనం కారణంగా శని వారం ఏలూరు నగరంలో అకస్మాత్తుగా వాతావరణం చల్లబడి వర్షం పడింది. ఉదయం 10 గంటల సమయంలో గంటసేపు కురిసినా వర్షం తర్వాత తగ్గింది. మరలా సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం బయటకెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వ్యాపారాలు చేసే వారు ఇబ్బందులు పడ్డారు.



భీమడోలు : వరి పంటపై కప్పిన బరకాలు

పోలవరం :మండలంలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణ పరిస్థితులు పూర్తిస్థాయిలో మారిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. గూటాల, కొత్తపట్టి సీమ, పోలవరం, ప్రగడపల్లి పంచాయతీల్లో నూర్చిన పంటను దళారులకు అమ్ముకుంటున్నారు. మరికొంత మంది రైతులు బరకాలు కప్పి ఒబ్బిడి చేసుకుంటున్నారు.

భీమడోలు : మండల పరిధిలో శనివారం కురిసిన అరకొర వర్షంతో రైతులు బెంబేలెత్తిస్తున్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఇప్పటికే అరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు కోతలను వాయిదా వేశారు. వ్యవసాయాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది ధాన్యం తరలించే విషయమై రైతులను చైతన్య పరుస్తున్నారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఆరబెట్టిన ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలకు అనువుగా ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ముదినేపల్లి : తుపాన్ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ మండల వ్యాప్తంగా వర్షపు జల్లులు పడ్డాయి. ఈదురుగాలులు, వర్షానికి చేలన్నీ నేలనంటాయి. దీంతో వరి గింజకు తేమ తగిలితే గింజ మొలక వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా 1,318 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. గరువు ప్రాంతాల్లో మాత్రమే స్వర్ణ వరి వంగడాన్ని సాగు చేయగా, దాదాపు గరువు ప్రాంతాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఎకరాకు పాతికవేలు పైబడి పెట్టుబడులు పెట్టినా పంట చేతికొస్తుందో లేదో తెలియని అయోమయంలో రైతులు ఉన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు.

రైతులు వరి కోతలు కోయొద్దు : జెసి



రైతులతో మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

ఫంగల్ తుపాన్ కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రెండు రోజులు వరి కోతలు కోయవద్దని రైతులకు జెసి పి.ధాత్రిరెడ్డి సూచించారు. దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో ఆమె శనివారం పర్యటించారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండి వాతావరణాన్ని గమనిస్తూ వరి పంటను, ఆరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకుంటూ అందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండే బరకాలు అన్నిటిని రైతులకు అందించాలని అన్ని డిపార్ట్‌మెంట్ అధికారులను అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు వెంటనే ట్రక్ షీట్ జనరేట్ చేసి తక్షణమై ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేర్చేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

భీమడోలు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతుల ఇబ్బందులను తెలుసుకునేందుకు జెసి ధాత్రిరెడ్డి శనివారం భీమడోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై ధాన్యం ఆరబెట్టి భద్రపరిచే ఏర్పాట్లలో ఉన్న రైతులతో మాట్లాడారు. ఇతర వివరాలను వ్యవసాయ అధికారి ఉషారాణి జెసి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో రైతులను ఆదుకునే క్రమంలో రైతుల అవసరాలకు సరిపోయే విధంగా టార్పాలిన్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరబెట్టిన ధాన్యంలో తేమ శాతం నిర్ణీత ప్రమాణాలకు మించి ఒకటి రెండు శాతం అదనంగా ఉన్నప్పటికీ మిల్లులకు తరలించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇవే వర్షాలు ఆదివారం కూడా కొనసాగితే రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు రామలక్ష్మి, రూపా దేవి, ఫణికుమార్ పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జెడి

ఉంగుటూరు : వర్షాల కారణంగా ధాన్యం తడిచిపోకుండా రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. తుపాన్ కారణంగా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను పరిశీలించి పరిష్కరించే ఉద్దేశంతో జెసి ధాత్రిరెడ్డి శనివారం ఉంగుటూరు మండలంలో పలు గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించి రైతులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోపీనాథపట్నంలోని పలువురు రైతులను కలిసి జెసి మాట్లాడారు. రైతులు తమకు దగ్గరలోని రైస్ మిల్లుకు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. హమాలీలు, రవాణా, రైస్ మిల్లర్లతో ఏదైనా సమస్యలు ఏర్పడితే దగ్గరలోని రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారుల దృష్టికి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 18004256453కి ఫోన్ చేసి తెలియజేస్తే పరిష్కరిస్తారన్నారు. జెసితో పాటు తహశీల్దార్ పూర్ణప్రసాద్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

విఆర్‌ఒలకు ఇతర శాఖల విధులు కేటాయించొద్దు

కలెక్టర్‌కు విఆర్‌ఒల సంఘం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విఆర్‌ఒలకు రెవెన్యూ విధులు తప్ప ఇతర శాఖల విధులు కేటాయించవద్దని ఉన్నతాధికారులు ఇచ్చిన మెమో అమలు చేసేలాగా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీరామచంద్రమూర్తి కలెక్టర్ కె.వెట్రిసెల్విని కోరారు. ఈ మేరకు శనివారం ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో విఆర్‌ఒలు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు, రెవెన్యూకు సంబంధం లేని, వివిధ రకాలైన డ్యూటీలు చేయమని పంచాయతీ సెక్రటరీలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. విఆర్‌ఒలకు ఇతర శాఖల పనులు కేటాయించకుండా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై పునరాలోచిస్తాం

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ప్రతిపాదిత నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ఏర్పాటుపై పునరాలోచన చేస్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే భావనతో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు తాను కృషి చేసినట్లు ఎంపీ పేర్కొన్నారు. అయితే స్థానిక ప్రజల మనోభావాలు, పలు సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రక్రియపై పునరాలోచన చేస్తున్నామని పేర్కొన్నారు. ఏది ఏమైనా ఈ ప్రాజెక్టు విషయంలో స్థానికుల అభిప్రాయాలను గౌరవిస్తామని తెలిపారు.

టీచర్స్ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పంగిడిగూడెం, గున్నంపల్లి జెపి హైస్కూళ్లలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి శనివారం ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్.ప్రసాద్, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫాలీ, రవికుమార్, ఎపిటిఎఫ్ 1938, బిటిఎ సంఘం సభ్యులు, యుటిఎఫ్ నేతలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న గోపీమూర్తి

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

వాతావరణ మార్పులతో అధికారులందరూ రైతులకు అందుబాటులో ఉండాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యం తరలింపులో రైతులకు అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో పెట్టాలన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ప్రతి రైతు సంతోషంగా ఉండాలన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో రైతుల నుంచి ఒక ఫిర్యాదు కూడా రాకుండా చూసుకునే బాధ్యత అధికారులు తీసుకోవాలని చెప్పారు.

ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి


ప్రజాశక్తి - భీమడోలు

తుపాన్ నేపథ్యంలో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ కోరారు. వారు భీమడోలు మండలంలోని భీమడోలుతో పాటు పోలసానిపల్లి, సూరప్పగూడెం గ్రామాల్లో శనివారం పర్యటించారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ధాన్యం సేకరణ విషయమై ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇస్తున్న హామీలకు, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులకు మధ్య కొంతమేరకు సమన్వయం జరగాల్సి ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులకు నాణ్యమైన గోనెసంచుల సరఫరా జరగటం లేదని, కొన్నిచోట్ల రైతుల అవసరాలకు సరిపడా గోనెసంచులు అందుబాటులో లేవని చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తరలించేందుకు 25 శాతం తేమ శాతాన్ని అమలు చేస్తామన్న ప్రజా ప్రతినిధుల వాగ్దానాలు అమలు కావడం లేదన్నారు. ధాన్యం రవాణా విషయమై రైతులకు అవసరమైన టార్పాలిన్లను రాయితీపై అందించే కార్యక్రమం కొనసాగటం లేదని, దీని కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే కార్యక్రమం రైతులు మరోసారి చేపట్టడం వల్ల రైతులకు ఆర్థిక భారం పెరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతు సంఘం ప్రతినిధులు సిహెచ్.రాజు, ఎ.శ్రీను, జి.రాజు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డిఎల్‌టిసి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షార్ట్ టర్మ్ కోర్స్ కింద అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబర్ ఏడో తేదీ లోగా 9493482414 నెంబర్‌ను సంప్రతించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని రవి తెలిపారు.


మాట్లాడుతున్న వక్తలు

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సర్వైకల్ క్యాన్సర్ సోకడానికి ప్రధాన కారణం హ్యూమన్ పాపిలోమా వైరస్ అని లైఫ్ హాస్పిటల్స్ డాక్టర్ బి.గీతిక అన్నారు. ఏలూరులోని ఆర్ఆర్.పేటలో ఉన్న యూనియన్ బ్యాంకులో లైఫ్ హాస్పిటల్స్ వారు సర్వైకల్ క్యాన్సర్‌పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీతిక మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకూడదంటే ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో హెచ్‌పివి వైరస్ సోకకుండా ముందస్తు వ్యాక్సినేషన్ చేయడం ప్రస్తుతం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ తొమ్మిది నుంచి 26 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు తీసుకుంటే భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా ఉండొచ్చన్నారు. నెలసరి సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిబ్బంది, లైఫ్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిటిసిల గౌరవ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎంపిటిసి సభ్యులకు గడచిన 20 నెలలుగా గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరం రిలీజ్ చేయాలని ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి కోరారు. రాష్ట్రంలో ఎంపిపిలు, ఎంపిటిసిలతో విజయవాడలో పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణతేజ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఉంగుటూరు ఎంపిపి హాజరయ్యారు. ఎంపిటిసిలకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలపై ఎంపిపి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు ఆమె విలేకర్లకు వెల్లడించారు. అనంతరం ఎంపిటిసిలు, ఎంపిపి సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

ఐఎంఎ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తా

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పేదలకు మెరుగైన వైద్యం అందించాలంటే ప్రభుత్వ ఉన్నత ఆశయానికి వైద్యులు కూడా తమ సంపూర్ణ మద్దతు అందించాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సూచించారు. మంచి వైద్యులుగా పేరొందిన డాక్టర్ దొంతంశెట్టి ఐనవరపు ఐఎంఎ అధ్యక్షులుగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఐఎంఎ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఏలూరు పవర్‌పేటలోని ఐఎంఎ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏలూరు బ్రాంచ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం నిర్వహించారు. ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న డాక్టర్ సదాశివరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యదర్శిగా డాక్టర్ పుట్టా నాగేంద్రబాబు, కోశాధికారిగా డాక్టర్ బి.ఆనందకుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ గొరిపర్తి నాగభూషణంతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని ఘనంగా సన్మానించారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసుకుని ఆ సొమ్మును ద్విచక్ర వాహనంలో ఉంచి పని చూసుకుని వచ్చే లోపల ఆ సొమ్మును అపహరించకపోయిన ఘటనలో నిందితుడిని భీమడోలు అరెస్టు చేశారు. సొమ్ము మొత్తాన్ని రికవరీ చేశారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి శ్రావణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి గ్రామానికి చెందిన నందమూరి సత్యనారాయణ ఈ నెల 25వ తేదీన భీమడోలు ప్రాంతంలో ఉన్న యూనియన్ బ్యాంకులో రూ.2.50 లక్షలు విత్ డ్రా చేసుకుని స్థానికంగా దుకాణంలో గృహ అవసర వస్తువులను కొనుగోలు చేసి తిరిగి వచ్చి మళ్లీ వేరొక చోటికి వెళ్లి అక్కడ తన ద్విచక్ర వాహనంలో ఉన్న డబ్బును చూసుకోగా ఆ డబ్బు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే స్థానిక భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన భీమడోలు సిఐ విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అత్యధిక పరిజ్ఞానం సహాయంతో ఈ కేసులో నిందితుడైన భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన చొప్ప రామును అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సత్యనారాయణ పోగొట్టుకున్న రూ.2.50 లక్షలు రికవరీ చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణానికి చెందిన స్పిన్నింగ్ మిల్ కార్మికుడు ఈటూరి చెన్నకేశవరావు (40) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ప్రభుత్వ ఐటిఐ కళాశాల వెనుక పామాయిల్ తోటలో ఉన్న బావిలో ఆయన మృతదేహం లభ్యమైంది. రెండు రోజుల క్రితం కనిపించకుండా వెళ్లిన చెన్నకేశవరావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. చెన్నకేశవరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కిశోర బాలికల వికాసంపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీను ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య కిశోర బాలికల వికాసంపై గ్రామస్థాయి కమిటీ శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్యవివాహాల నివారణ, కిశోర బాలికలకు పౌష్టికాహారం తదితర అంశాలపై ఎంపిడిఒ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం మండల ఇన్‌ఛార్జి సిడిపిఒ రాణి, సూపర్‌వైజర్ మాధవి, ఎన్ఆర్ఆజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచి సొంత నిధులతో పుంత దారి అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్లరాజుపాలెంలో పొలాలకు వెళ్లే పుంత రహదారి అభివృద్ధి పనులను సర్పంచి నార్ని వెంకట్రావు శనివారం చేపట్టారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు పొంత రహదారి ఛిద్రంగా ఉండడంతో స్థానికుల అభ్యర్థనతో సర్పంచి నార్ని వెంకట్రావు తన సొంత నిధులు సుమారు రూ.50 వేలు వెచ్చించి జెసిబి సాయంతో ఆ దారి పొడవునా ఉన్న తుప్పలు తొలగించి, గోతులు పూడ్పించారు. పుంత రహదారి అభివృద్ధి చేయడంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేఫ్ ఇండియా కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సేఫ్ ఇండియా నినాదాలు చాటుతూ విద్యార్థులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. నూజివీడు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో సేఫ్ ఇండియా కోసం ప్రతిఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని నినదిస్తూ విద్యార్థులంతా ర్యాలీ నిర్వహించారు. పట్టణ సిఐ పి.సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణం చేసే సమయంలో ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లు నడిపే సమయంలో సీటు బెల్ట్ వినియోగించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి రక్షణ ఏర్పడుతుందన్నారు. గులాబీలు చేతపట్టిన విద్యార్థులు సేఫ్ ఇండియా అంశాలను తెలియజేస్తూ వాహన చోదకులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.రామ్మోహన్, అకాడమిక్ డీన్ ఎస్.దుర్గబాబు, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి పి.శోభనాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - చింతలపూడి

పాస్‌వర్డ్ లీకేజీల విషయంలో నిందితులు మీ ఇమెయిల్ చిరునామాలు, వినియోగదారు పేర్లు, పాస్‌వర్డ్‌ల కలయికను కలిగి ఉంటారని, వాటిని ఇతర సైట్‌లలో ప్రయత్నించడానికి ఉపయోగిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం సోషల్ మీడియా సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ ఖాతాల్లో ఒకే పాస్‌వర్డ్‌ను ఉపయోగించడం వల్ల ఒక వెబ్‌సైట్‌లో లీకేజీ దాడి చేసేవారిని ఈ ఖాతాలను యాక్సెస్ చేయగలదని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ కె.నరేంద్రకుమార్ మాట్లాడుతూ చాలా మంది సోషల్ మీడియా ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్‌ని ఉపయోగిస్తున్నారన్నారు. విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కళాశాల ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ మీర్ హసీం మాట్లాడుతూ పాస్‌వర్డ్ మేనేజర్ వినియోగదారుల లాగిన్ వివరాలను నిల్వ చేస్తుందని, ఖాతాలకు స్వయంచాలకంగా లాగిన్ అయ్యేలా చేస్తుందని, పాస్‌వర్డ్ మేనేజర్ మాస్టర్ పాస్‌వర్డ్‌ని ఉపయోగించి పాస్‌వర్డ్ డేటాబేస్‌ను గుప్తీకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు జి.సురేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

గత నెల పెండింగ్‌లో ఉన్న సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రస్తుత నెల చేపట్టిన పంపిణీ కార్యక్రమంతో కొనసాగిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలో శనివారం ఉదయం నుంచి ప్రారంభించారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతానికి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం 90 శాతం దాటినట్లు మండల పరిషత్ సభ్యులు తెలిపారు. ఇంకానూ పెన్షన్లు తీసుకోని వారికి డిసెంబర్ రెండో తేదీన పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఎంపిడిఒతో పాటు పంచాయతీ విస్తరణాధికారి సుందరి కురెళ్లగూడెంలో కొనసాగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి గాయత్రి వీరికి సహకరించారు.

జీలుగుమిల్లి :మండల వ్యాప్తంగా 4,272 పెన్షన్లకు 4,046 పెన్షన్లను సచివాలయ సిబ్బందితో శనివారం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఒకటో తేదీన ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలవ్యాప్తంగా 95 శాతం వరకు పెన్షన్ల ప్రక్రియ పూర్తయినట్లు ఆమె తెలిపారు.

విజయ్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

విశ్వగురు వరల్డ్ రికార్డు వారి 2024 అవార్డు కిస్పోర్ట్స్ క్యాటగిరిలో ఊదర్ల విజయ్ నాటినల్ అవార్డ్‌కు ఎంపికైనట్లు విశ్వగురు వరల్డ్ రికార్డు ఫౌండర్, ఛైర్మన్ సత్యహైవాలు రాంబాబు తెలిపారు. ఈ అవార్డును ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్, ప్లేయ్ బ్యాక్ సింగర్, ఎం.ఎం.శ్రీలేఖ, డాక్టర్ కొండా నరసింహారావు, సినీ హీరో సుధీర్ బాబు తల్లి రాణిలతో పాటు మరి కొంత మంది ప్రముఖులు ఇవ్వనున్నారని తెలిపారు. అవార్డుకు ఎంపికైన విజయ్‌ను పలువురు అభినందించారు.

చంద్రబాబు సిఎం అయినందుకు పాదయాత్ర


ప్రజాశక్తి - కుక్కునూరు

చంద్రబాబు నాయుడు సిఎం అయినందుకు విశాఖపట్నం జిల్లా తుంగ్లం గ్రామంలో గల రామాలయం నుంచి భద్రాచలం రామాలయం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు విశాఖపట్నం (జివిఎంసి) 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. ఆయన పాదయాత్ర శనివారం కుక్కునూరు మండలానికి చేరుకున్న సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. పాదయాత్ర నేటికీ పదకొండు రోజులైయిందని, దాదాపు 360 కిలోమీటర్ల సాగిందన్నారు. ఆయన పాదయాత్రకు టిడిపి కుక్కునూరు టిడిపి మండలాధ్యక్షులు ముల్లిశెట్టి నాగేశ్వరరావు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటరీ స్వీపర్లు సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కార్యదర్శి, ఎస్‌కె.సుభాషిణి మాట్లాడుతూ మూడు నెలల బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, అమలు యూనిఫామ్ సౌకర్యం, సెలవు దినాలు, క్యాజువల్ లీవుల అమలు కోరారు. వేతనాలు ప్రస్తుతం రూ.16 వేలు వస్తున్నాయని, అందులో పిఎఫ్ రూ.రెండు వేలు కట్ అయి రూ.14 వేలు రావాలని, కాని రూ.12 వేలు మాత్రమే వస్తున్నాయని చెప్పారు. మిగిలిన రూ.రెండు వేలు ఎక్కడ ఆగాయో ఇప్పటివరకు తెలియడంలేదన్నారు. ఎన్ని నెలలు రూ.రెండు వేల చొప్పున రావాలో మొత్తం నగదు కార్మికుల ఖాతాలో జమ చేయాలని కోరారు. జిఒ నెంబర్ 36 ప్రకారం వర్కర్స్‌కి రూ.21 వేలు ఇవ్వాలని, సూపర్‌వైజర్లకు రూ.24 వేలు జీతం ఇవ్వాలని, ఆ జిఒ వెంటనే అమలు చేయాలని డిమాండ్


వినతిపత్రం అందిస్తున్న ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు

చేశారు. సంవత్సరానికి మూడు జతల యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, గన్ బూట్లు ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్స్ అన్ని కూడా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దయామని, కార్యదర్శి మేరీ, మున్సిపల్ వర్కర్స్ టౌన్ అధ్యక్షులు రేలంగి నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, వెంకటేష్, చంద్రకళ, శకుంతల సీత, వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో రాజకీయమా..!

మున్సిపల్ సాధారణ సమావేశంలో అధికారులను నిలదీసిన వైస్ ఛైర్మన్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఛైర్మన్లు


సమైక్యంగా పట్టణాభివృద్ధికి పాటు పడాల్సిన తరుణంలో రాజకీయం తగదని మున్సిపల్ వైస్ ఛైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. నూజివీడు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గా అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ పట్టణ అభివృద్ధి కోసం మంజూరు చేసిన రూ.16 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. పట్టణంలోని 32 వార్డుల అభివృద్ధికి అనేక పనులను ప్రతిపాదించగా, సిఎం కార్యాలయం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. అసలు మంజూరు కావడమే గొప్పగా ఉన్న ప్రస్తుత తరుణంలో, నిధుల విషయం ఏమైందంటూ ప్రశ్నించారు. మరో వైస్ చైర్‌పర్సన్ కొమ్ము వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను గత నెల 24వ తేదీన ఆరు అంశాలు, 26వ తేదీన మరో రెండు అంశాలు ప్రతిపాదించగా ఎజెండాలో ఎందుకు పొందుపరచలేదని అధికారులను సూటిగా ప్రశ్నించారు. కౌన్సిల్ సభ్యులంతా పట్టణ అభివృద్ధికి పాటుపడేందుకు ఉన్నామని, ఇంతటి రాజకీయం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల ప్రతిపాదనలకు విలువ లేదా అని వాపోయారు. ఎజెండాలో సూచించిన అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించిన మీదట పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్, పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

గురజాడ రచనలు ఎంతో గొప్పవి

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

కవి సంస్కర్త గురజాడ అప్పారావు 19వ వర్ధంతి పురస్కరించుకుని ఏలూరు పరిసర ప్రాంతాల్లో స్కూల్స్, కాలేజీల్లో దేశమును ప్రేమించుమన్నా గేయం సామూహిక ఆలాపన, సభలు నిర్వహించారు. హేలాపురి బాలోత్సవం, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, భారత్ బచావో, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త పిలుపుమేరకు గురజాడ 109వ వర్ధంతి సందర్భంగా స్కూల్స్ ప్రేయర్లలోనూ, క్లాస్ రూముల్లో ప్రత్యేక సభల ద్వారా గురజాడ అప్పారావుకు నివాళులర్పించారు. వేలాదిమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారన్నారు. నారాయణ హైస్కూల్‌లో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలుగు టీచర్ రమ్య ఆధ్వర్యంలో విద్యార్థులు దేశమును ప్రేమించమన్న గేయం ఆలాపన చేశారు. శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్ నగరంలో గురజాడ అప్పారావు వద్ద ఉన్న స్కూలు శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్‌లో సభకు బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి


మాట్లాడుతున్న వక్తలు

గుడిపాటి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు సిహెచ్ హరిబాబు అధ్యక్షత వహించారు. మ్యూజిక్ టీచర్ జి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులంతా దేశమును ప్రేమించుమన్నా గేయాన్ని సామూహికంగా ఆలాపన చేశారు. పిఇటి గోపాల్, టీచర్స్ రమ్య, మారుతి పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్ చంద్రావతి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు, హేలాపురి బాలోత్సవం సెక్రటరీ గుడిపాటి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లెక్చరర్ చంద్రావతి మాట్లాడుతూ గురజాడ రాసిన గేయం, రచనలు మహిళలను ఎంతో గొప్పగా ఉండేలా ఆశలతో ఉన్నాయన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆ సభలో పాల్గొన్నారు.

వీధి కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరంలో వీధి కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ చెప్పారు. ఏలూరులోని పశుసంవర్ధక ఆసుపత్రిలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను శనివారం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో సుమారుగా 1900 వీధి కుక్కలు ఉన్నాయని, వీటి కారణంగా ప్రజలు, ముఖ్యంగా చిన్నపిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలను వీధి కుక్కల నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసరించి హర్యానాకు చెందిన ఎస్ఎస్ఇహెచ్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వారి సహకారంతో వీధి కుక్కలకు పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో ఏలూరు నగరపాలక సంస్థ, పరిధిలోని 50 డివిజన్లలో 1900 వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, రేబిస్ వ్యాధి సోకకుండా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నామన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సర్వే

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం- గణపవరం రాష్ట్రీయ రహదారి నారాయణపురం బజారులో గత నెల 18న ఆక్రమణలు తొలగించారు. ఈ క్రమంలో దారికి అడ్డంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్‌ను మార్చాల్సి ఉంది. ఈనేపథ్యంలో ఆర్అండ్‌బి స్థలం హద్దులు మేరకు ఎక్కడెక్కడా స్తంభాలు వేయాలి..ఎంతెంత దూరం వేయాలి.. ఎన్ని స్తంభాలు పడతాయో ప్రాథమిక సర్వే శనివారం నారాయణపురం విద్యుత్ ఎఇ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి, పంచాయతీ సిబ్బంది సమక్షంలో ప్రాథమిక సర్వే చేశారు. అయితే ఆర్అండ్‌బి స్థలం ఎక్కడి వరకూ ఉంది... హద్దులపై నిర్దిష్టమైన స్పష్టత రాకపోవడంతో పోల్స్ ఎక్కడ నిర్మించాలో తెలియటం లేదు. ఆర్అండ్‌బి, రెవెన్యూ, సర్వే అధికారులు దగ్గరుండి నిర్దిష్టమైన హద్దులను ఎలక్ట్రికల్ శాఖ వారికి చూపిస్తేనే శాశ్వతంగా పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణ పనులు ముందుకు సాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన వల్ల దాని ఉద్రిక్తత తగ్గిందని, ఇంకా పూర్తిగా మాయమయ్యే వరకు అలసత్వం పనికిరాదని చెప్పారు. అనంతరం జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ సంక్రమించే విధానం, అది వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు, సిపిడిసి మెంబర్ ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, రంగోలి, వకృత్వం అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

మహాకవి గురజాడ వర్ధంతి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యుగకర్త మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల సిపిడిసి మెంబర్ ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు మాట్లాడారు.

ఉంగుటూరు :ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి బహుమతుల అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి జి.హెప్సిబా మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంకన్న బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ జి.నిర్మలకుమారి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, ఐక్యు కోఆర్డినేటర్ డి.రెడ్డయ్య పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి నివారణపై కళాశాలలో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించిన గెలుపొందినవారికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్రకుమార్ బహుమతులు అందించారు. ఆర్ఆర్‌సి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డి.శంకరపోలయ్య, పి.అచ్చిబాబు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్ అన్నారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగాఆగిరిపల్లిలో నెహ్రూ యువ కేంద్ర, ఆనంద మహిళా మండలి సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కె.యోహాన్ అధ్యక్షత వహించగా ఆనంద మహిళా మండలి అధ్యక్షురాలు టి.సంధ్యారాని, విజయ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ఎన్.విజయనిర్మల, ఎంపిహెచ్‌ఒ రత్నబాబు పాల్గొన్నారు.